

సోమశిలలో 8.01 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 8.012 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 210 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,870
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,616
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,814
నవర (8 గ్రాములు)	రూ.54,512



ప్రమాదంలో యువకుడి దుర్మరణం

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని యువకుడు మృతి చెందారు. మనుబోలులోని బైపాస్ రోడ్డు వద్ద ఘటన చోటుచేసుకుంది. 8లో

న్యూస్‌రీల్

పోస్టల్ బ్యాలెట్‌కు నేడూ అవకాశం



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): పోస్టల్ బ్యాలెట్‌ను బుధవారం సైతం వినియోగించుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్లోని తన చాంబర్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎన్నికల విధుల్లో ఉన్న వారి కోసం ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. ఇప్పటి వరకు దాదాపు 20 వేల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని వివరించారు. బుధవారంతో గడువు ముగియనున్న తరుణంలో అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రికెట్ సెలక్షన్ కమిటీలో మలిరెడ్డికి మరోసారి చోటు



కోటారెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీఏ జూనియర్స్ మెన్ సెలక్షన్ కమిటీ సౌత్‌జోన్ సభ్యుడిగా రంజీ మాజీ క్రీడాకారుడు మలిరెడ్డి కోటారెడ్డిని మరోసారి నియమించారు. ఈ మేరకు ఏసీఏ నిర్వాహకులు ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడారు. తనపై ఏసీఏ ఉంచిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తానని, జిల్లాలో క్రికెట్ ప్రగతికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కాగా ఆయన నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక బస్సులు

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది సౌకర్యార్థం 255 ప్రత్యేక బస్సులను ఆర్టీసీ ఆధ్వర్యంలో నడపనున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరు నుంచి వివిధ ప్రాంతాలకు 103, కావలి నుంచి 36, కందుకూరు నుంచి 29, ఆత్మకూరు నుంచి 44, ఉదయగిరి నుంచి 43 బస్సులను కేటాయించామని వివరించారు. ఈ బస్సులు సంబంధిత ఆర్వో కార్యాలయాల నుంచి ఈ నెల 12న బయల్దేరనున్నాయని చెప్పారు. ఎన్నికల ముగిసిన అనంతరం 10.30, 11.30, 00.30కు తిరిగి బయల్దేరతాయని తెలిపారు.

కూటమి పార్టీలకు బుద్ధి చెప్పడం తథ్యం



మాట్లాడుతున్న హనోక్

కావలి: దళితులు, క్రైస్తవులు, మైనార్టీలను కించపర్చి.. వారి మనోభావాలను దెబ్బతీసిన కూటమి పార్టీలకు రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కో ఆర్డినేటర్ గెరా హనోక్ పేర్కొన్నారు. కావలి పట్టణంలోని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను పరిపూర్ణంగా అమలు చేసిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. విన్సెంట్, యేసురత్నం, ఇర్మియా, ప్రభాకర్, రక్షణబాబు, రతన్‌బాబు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం


నెల్లూరు(వీఆర్సీసెంటర్): జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడలు, సామాజిక, సేవారంగం, ధైర్య సాహసాలు, నూతన ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణ, సాంస్కృతిక సంప్రదాయాలు, శాస్త్ర సాంకేతిక, విజ్ఞాన రంగాల్లో అత్యంత ప్రతిభ చూపిన బాలబాలికలు జూలై 31లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. awards.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కేంద్ర కమిటీ పరిశీలించి అర్హులను ఎంపిక చేయనుందని, వీరికి వచ్చే ఏడాది జనవరిలో రాష్ట్రపతి చేతుల మీదుగా బహుమతి, ప్రశంసపత్రం, జ్ఞాపికను అందజేయనున్నారని వివరించారు.

దురాయితో దొరవుదామని..



జిల్లాలోని మత్స్యకార గ్రామాల్లో దురాయి అనే ఆచారం ఎంతో కాలంగా ఉంది. గ్రామంలో ఏదైనా సమస్య వస్తే అక్కడి కాపులు సమావేశమై తీర్పునివ్వడం దీని ప్రధాన లక్ష్యం. ఈ శాసనాన్ని ఎవరూ అతిక్రమించకుండా తప్పక గౌరవించాలి. ఈ క్రమంలో ఈ ఆచారాన్ని టీడీపీ తమకు అనుకూలంగా మార్చుకుంటోంది. తీర ప్రాంతంలోని మత్స్యకార గ్రామాల్లో నోట్ల కట్టలను వెదజల్లుతూ.. తమ పార్టీ అభ్యర్థికే ఓటేసేలా అక్కడి పెద్దల ద్వారా శాసనం జారీ చేయిస్తోంది. ఓటమి భయంతో వేమిరెడ్డి వ్యవహరిస్తున్న తీరు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

- మత్స్యకార గ్రామాల్లో అనాదిగా ఆచారం
- మరోసారి తెరపైకి తెచ్చిన టీడీపీ
- లక్ష్యాన్ని మార్చేసి.. ఓట్లను నోట్లతో కొనుగోలు చేస్తున్న వైనం
- విడవలూరు మండలంలో రూ.1.65 కోట్లతో ఎర
- గతంలో ఇందుకూరుపేటలోనూ ఇదే తంతు
- ఓటమి భయంతో డబ్బులను కుమ్మరిస్తున్న వేమిరెడ్డి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఎన్నికల్లో గెలుపొందడమే ధ్యేయంగా టీడీపీ కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అడ్డదారులు తొక్కుతున్నారు. ప్యాకేజీలను ప్రకటించి పలు పార్టీల నేతలను తమ వైపు తిప్పుకోవడం.. వందల కోట్లను నీళ్లలా పారిస్తూ ఓట్లను కొల్లగొట్టాలని వీరు యత్నించినా, ఆశించిన స్థాయిలో ఫలితం కానరావడం లేదు. ఈ తరుణంలో వీరి చూపు మత్స్యకార గ్రామాలపై పడింది. గ్రామాల్లో అనాదిగా వస్తున్న దురాయి ఆచారాన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు పావులు కదుపుతున్నారు.

నిన్న ఇందుకూరుపేట.. ఇప్పుడు విడవలూరు

దురాయి పేరిట ఇందుకూరుపేట మండలంలోని కృష్ణాపురంలో ఓట్లను వేమిరెడ్డి దంపతులు కొనుగోలు చేసిన విషయం విదితమే. తాజాగా విడవలూరు మండలంలోని రెండు మత్స్యకార గ్రామాలపై వీరు చూపు పడింది. స్థానికుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని డబ్బుతో ఓట్లను కొల్లగొడుతున్నారు.

తీర ప్రాంతంపైనే దృష్టంతా..

కోవూరు నియోజకవర్గంలోని తీర ప్రాంతంలో మత్స్యకార గ్రామాలు చాలా ఉన్నాయి. మత్స్యకార నేతలతో రహస్య మంతనాలు సాగిస్తూ దురాయి ద్వారా ఓట్లు వేయించాలని అభ్యర్థిస్తున్నారు.

- ఇందుకూరుపేట మండలంలోని కృష్ణాపురం పంచాయతీలో 781 ఓట్లకు రూ.80 లక్షలతో బేరాన్ని వేమిరెడ్డి దంపతులు కుదుర్చుకున్నారని సమాచారం. ఇలా ఓటుకు రూ.10,200 మేర వెచ్చించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.
- విడవలూరు మండలంలోని కొత్తూరులో 700 ఓట్లకు రూ.75 లక్షలు.. లక్ష్మీపురంలో 1100 ఓట్లకు రూ.90 లక్షలు.. ఇలా రూ.1.65 కోట్లను వెచ్చించారనే టాక్ స్థానికంగా నడుస్తోంది. దురాయి ఆచారాన్ని అడ్డుపెట్టుకొని ఓట్లను నిస్సిగ్గుగా కొనుగోలు చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

అధికారులెక్కడా..?

ప్రజాస్వామ్య వ్యవస్థకు పాతరేసేలా టీడీపీ సాగిస్తున్న కుతంత్రాలపై అధికార యంత్రాంగం స్పందించకపోవడం గమనార్హం. దురాయి ద్వారా ఇందుకూరుపేట మండలంలో ఓట్ల కొనుగోలు వ్యవహారం బయటకొచ్చినప్పుడూ అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించింది. తాజాగా విడవలూరు మండలంలో వెలుగులోకి వచ్చినా అధికారులు తమ పాత పంథానే కొనసాగిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.


ప్రతి చోటా ఇంతే..

కోవూరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఎలాగైనా ఎన్నికల్లో గెలవాలనే లక్ష్యంతో నోట్ల కట్టలకే పని కల్పించారు. వర్గ విభేదాలతో పార్టీ కేడర్ వారికి ముఖం చాటేయడంతో గెలుపు కోసం అడ్డదారులు వెతుక్కుంటున్నారు. గ్రామాల వారీగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు రూ.15 లక్షలు.. ఎంపీపీలు, జెడ్పీటీసీలకు రూ.25 లక్షల చొప్పున ప్యాకేజీలను నిర్దేశించి కొనుగోలు చేస్తున్నారు. ఓటర్లకు సైతం భారీగానే డబ్బులిస్తామని, వీటి పంపిణీ బాధ్యత మీదేనని చెప్తుండటం గమనార్హం.

దురాయి అంటే..

మత్స్యకార గ్రామాల్లో దురాయి ఆచారం అనాదిగా వస్తోంది. గ్రామంలో ఏదైనా సమస్య ఉత్పన్నమైతే గ్రామానికి పెద్దగా ఉండే కాపులు దేవాలయం వద్ద సమావేశమై తీర్పునిస్తారు. ఈ తీర్పును ప్రతి ఒక్కరూ శిరసావహించాల్సి ఉంటుంది. దీన్ని అతిక్రమిస్తే వారిని ఊరి నుంచి వెలేసేందుకు అవకాశం ఉంది. గత ఎన్నికల సమయాల్లోనూ ఇక్కడి పెద్దలు ఒక రాజకీయ పార్టీని ఎంచుకొని సదరు అభ్యర్థికే ఓట్లేయాలని ఆదేశించేవారు. సదరు అభ్యర్థి ప్రకటించే నిధులను గ్రామాభివృద్ధి లేక ఇతరత్రా కార్యక్రమాలకు వినియోగించుకునేవారు. అయితే ఈ ప్రక్రియ చట్టవిరుద్ధం కావడం.. ప్రజాస్వామ్యంలో ఓటును నోటుకు అమ్మడం నేరమనే అంశంపై అధికారులు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. దీంతో కొన్నేళ్లుగా ఈ ఆచారం మరుగునపడింది. అయితే ప్రస్తుత ఎన్నికల తరుణంలో ఈ వ్యవహారాన్ని టీడీపీ నేతలు మరోసారి తెరపైకి తెచ్చారు. ఓట్లను నోట్లతో కొనుగోలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు.

గిరిలో గెలిస్తే.. ఏపీలో అధికారం



- ఐదు ఎన్నికల నుంచి కొనసాగుతున్న సెంటిమెంట్
- 1999 నుంచి 2019 వరకు ఇదే తరహాలో..

ఉదయగిరి: గిరిలో గెలిస్తే.. ఏపీలో అధికారమా.. ఇదేంది.. ఇలా ఎలా అనే అనుమానం కలగక మానదు. అయితే గడిచిన ఐదు ఎన్నికల సరళిని పరిశీలిస్తే ఇదే ఆనవాయతీ కొనసాగుతోందంటే ఆశ్చర్యం కలుగుతుంది. జిల్లాలోని ఉదయగిరి నియోజకవర్గంలో 1999 ఎన్నికలు మొదలుకొని 2019 వరకు ఇదే పద్ధతి కొనసాగింది. ఉదయగిరి కోటపై జెండా ఎగురవేసే పార్టీయే రాష్ట్రంలో అధికార పగ్గాలు దక్కించుకుంటుందనే విశ్వాసం ఈ ప్రాంత ప్రజలతో పాటు రాజకీయ నాయకుల్లో బలంగా ఏర్పడింది. ఈ ఎన్నికల్లో ఇక్కడ ఏ పార్టీ గెలుస్తుందో.. ఏ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందో తేలాలంటే జూన్ నాలుగు వరకు వేచి ఉండాల్సిందే. ఇప్పటి వరకు కొనసాగుతున్న ఆనవాయతీ నిజమవుతుందా లేక సెంటిమెంట్‌కు తెరపడుతుందాననే అంశం ఫలితాల్లో తేటతెల్లం కానుంది.

ఇదీ తీరు..

- 1999 ఎన్నికల్లో టీడీపీ తరఫున కంభం విజయరామిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పోటీ చేయగా, టీడీపీ విజయం సాధించింది. ఆ సమయంలో రాష్ట్రంలో చంద్రబాబు ఆధ్వర్యంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.
- 2004లో కాంగ్రెస్ తరఫున మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థిగా కంభం విజయరామిరెడ్డి బరిలో నిలవగా, మేకపాటికే విజయం వరించింది. అప్పుడు రాష్ట్రంలో వైఎస్సార్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికార పగ్గాలు చేజిక్కించుకుంది.
- 2009 ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ తరఫున వీరే బరిలో నిలవగా, మేకపాటికే విజయం చేకూరింది. అప్పుడూ కాంగ్రెస్ పార్టీయే రాష్ట్రంలో అధికారాన్ని దక్కించుకుంది.
- 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి బొల్లినేని రామారావు, వైఎస్సార్సీపీ తరఫున మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పోటీపడగా, టీడీపీ విజయం సాధించింది. రాష్ట్రంలోనూ టీడీపీ అధికారం చేపట్టింది.
- 2019 ఎన్నికల్లో వీరే పోటీపడగా, భారీ మెజార్టీతో చంద్రశేఖర్‌రెడ్డి విజయం సాధించారు. ఆ సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

ప్రశాంత ఎన్నికలకు చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న దీపక్ మిశ్రా

- రాష్ట్ర ప్రత్యేక పోలీస్ పరిశీలకుడు దీపక్ మిశ్రా

నెల్లూరు(బారకాసు): రానున్న ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా.. పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రత్యేక పోలీస్ పరిశీలకుడు దీపక్ మిశ్రా ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో పోలీస్ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కల్పించాలని సూచించారు. రాజకీయాలు.. కులమతాలకతీతంగా పోలీస్ అధికారులు పనిచేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు గుంపులుగా ఉండకుండా చూడాలని చెప్పారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలకు పటిష్టమైన భద్రత కల్పించాలని సూచించారు. ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు తీసుకెళ్లే సమయంలో మార్గమధ్యలో ఆపకుండా చర్యలు చేపట్టాలని, వాహనాలకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



సమావేశానికి హాజరైన పోలీస్ అధికారులు

వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాటు

జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ హరినారాయణన్ వెల్లడించారు. జిల్లాలో ఒకే ప్రాంతంలో మూడు, నాలుగు పోలింగ్ కేంద్రాలు ఉన్న చోట సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ మాట్లాడారు. నగదు, మద్యం అక్రమ రవాణా కట్టడే లక్ష్యంగా జిల్లాలో 18 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలోని 2470 పోలింగ్ కేంద్రాలకు గానూ 450 సమస్యాత్మక కేంద్రాలని వివరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. అనంతరం పోలీస్ ప్రణాళికను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఎస్పీ వివరించారు. తొలుత కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జరుగుతున్న కార్యకలాపాలను రాష్ట్ర ప్రత్యేక పోలీస్ పరిశీలకుడు పరిశీలించారు. జిల్లా ప్రత్యేక పోలీస్ పరిశీలకుడు అశోక్ దూబే, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి, ఏఎస్పీ సౌజన్య, నెల్లూరు టౌన్, రూరల్, కావలి, ఆత్మకూరు, కందుకూరు డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, వీరాంజనేయరెడ్డి, ప్రసాద్, కోటారెడ్డి, శ్రీనివాస్, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే వైఎస్సార్సీపీ అజెండా



అభివాదం చేస్తున్న విజయసాయిరెడ్డి, బుర్రా



రోడ్‌షోకు భారీగా హాజరైన జనసందోహం

- జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలి
- పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి
- ఉలవపాడులో భారీ రోడ్‌షో

ఉలవపాడు: అభివృద్ధే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అజెండా అని.. రాష్ట్రంలో సుపరిపాలనను కొనసాగించేందుకు జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయాలని పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఉలవపాడులో ఎన్నికల ప్రచారాన్ని పార్టీ కందుకూరు అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావుతో కలిసి విజయసాయిరెడ్డి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని చెప్పారు. పొరపాటున టీడీపీ అధికారంలోకి వస్తే ప్రస్తుత పథకాలను రద్దు చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సీఎంపై చంద్రబాబు అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.

గౌరవించలేని అనుభవమెందుకు..?

ఎదుటి వ్యక్తికి గౌరవమివ్వలేని 40 ఏళ్ల అనుభవం ఎందుకని ప్రశ్నించారు. రాష్ట్రంలో 87 శాతం ఇళ్లకు ఏదో ఒక రూపంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. ఈ ఐదేళ్లలో అభివృద్ధి, సంక్షేమంతో సుపరిపాలనను జగన్‌మోహన్‌రెడ్డి సాగించారని కొనియాడారు. ఉలవపాడులో మామిడి పరిశోధన కేంద్ర ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. రూ.70 కోట్లతో మామిడి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, కోల్డ్ స్టోరేజీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్తలు హైదరాబాద్, కర్ణాటక, తమిళనాడులో పెట్టుబడులు పెడుతున్నారని, వీరందర్నీ తీసుకొచ్చి నెల్లూరులో పెట్టుబడులు పెట్టించి పారిశ్రామికాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

టీడీపీకి నాయకులేరీ..?

నెల్లూరులో టీడీపీకి నాయకత్వం లేదని, ఈ తరుణంలో తమ పార్టీ నుంచి వెళ్లిన వారే ఆ పార్టీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని విమర్శించారు. వేమిరెడ్డికి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో గౌరవమిచ్చారని, అయితే ఆయన సతీమణికి టికెట్ ఇవ్వలేదని సాకుగా కందుకూరులో బీసీకి, నెల్లూరు సిటీలో ముస్లింకు సీటును ఇచ్చారనే నెపంతో పార్టీని మారారని ఆరోపించారు. డబ్బులు భారీగా పంచేందుకు ఆయన సిద్ధమయ్యారని ధ్వజమెత్తారు. తాము అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని బీజేపీ చెప్తోందని.. దీనికి చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆశీర్వదించండి

బడుగు, బలహీనవర్గాల ప్రతినిధిగా జగనన్న ఆశీస్సులతో ముందుకొచ్చానని, ఈ ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని మధుసూదన్‌యాదవ్ కోరారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టేందుకు చంద్రబాబు యత్నిస్తున్నారని ఆరోపించారు. అనంతరం బీద మస్తాన్‌రావు మాట్లాడారు. సామాజిక న్యాయం అమల్లో భాగంగా బీసీ అయిన మధుసూదన్ యాదవ్‌కు టికెట్‌ను సీఎం కేటాయించారని చెప్పారు. వేలాది మందికి ఉద్యోగాలు రావాలంటే మరోసారి తమ పార్టీ అధికారంలోకి రావాలని చెప్పారు. రోడ్‌షోకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కనకదుర్గమ్మ గుడిలో పూజలు నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బద్దిపూడిలో రాఘవరెడ్డి ఇంటి వద్ద పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్సీపీలో చేరారు. పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్, పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు రామాల శింగారెడ్డి, మండల కన్వీనర్ పోతురాజు, జేసీఎస్ కన్వీనర్ ధన కోటేశ్వరరావు, సర్పంచ్‌లు నాగలక్ష్మి, అనిల్‌రెడ్డి, గ్రామ కన్వీనర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పోలీస్, ఎస్ఈబీ అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. జిల్లాలో అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 225 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని నిందితులపై కేసులు నమోదు చేశారు. వరికుంటపాడు లో 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

పోస్టల్ బ్యాలెట్ @ 94.24 శాతం



నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికలను పురస్కరించుకొని మూడు రోజులుగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ఓటింగ్ శాతం 94.24గా నమోదైంది.

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైనవి	శాతం
నెల్లూరు సిటీ	2419	2315	95.7
ఆత్మకూరు	2352	2220	94.3
సర్వేపల్లి	1332	1255	94.2
ఉదయగిరి	2336	2207	94.4
కావలి	2933	2757	93.9
నెల్లూరు రూరల్	4809	4335	90.0
కోవూరు	2715	2576	94.8
కందుకూరు	1635	1580	96.6

అదుపుతప్పిన బొలెరో

- ఇంజినీర్ దుర్మరణం

హుకుంపేట: అదుపుతప్పి బొలెరో బోల్తాపడటంతో ఇంజినీర్ మృతి చెందిన ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు.. అరకు – పాడేరు ప్రధాన రహదారిపై కొట్నాపల్లి నుంచి హుకుంపేట వైపు వస్తున్న బొలెరో గడుగుపల్లి సమీపాన తాడిపుట్టు జంక్షన్ వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో హైవే అథారిటీలో పనిచేస్తున్న ముత్తుకూరుకు చెందిన ఇంజినీర్ వలసంగారి పవన్ (28) అక్కడికక్కడే మృతి చెందారు. వాహనం వెనుక కూర్చున్న ఆఫీస్ బాయ్ స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్సై సతీష్ ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణమైన బొలెరో డ్రైవర్ పొన్నం సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పవన్ మృతదేహం



బోల్తాపడిన వాహనం

క్లుప్తంగా

సీఎం జగన్ వెంటే ఉంటాం

• ఆర్యవైశ్యుల నిర్ణయం



మాట్లాడుతున్న జగదీష్ గుప్తా

ఆత్మకూరు: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే నడుస్తాం. ఆయన రెండోసారి సీఎం అయ్యేందుకు సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయం కోసం పనిచేస్తాం' అని పట్టణంలోని పలువురు ఆర్యవైశ్యులు వెల్లడించారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్ గుప్తా ఆధ్వర్యంలో ఆత్మకూరులో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలోనూ ఆర్యవైశ్యులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మద్దతుగా నిలిచారన్నారు. అప్పట్లో మేకపాటి గౌతమ్‌రెడ్డికి అండగా నిలిచి ఆయన విజయంలో భాగం పంచుకున్నట్లు తెలిపారు. ఈ దఫా ఎన్నికల్లో నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి విజయం కోసం ప్రచారం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దోర్నాదుల లక్ష్మణ, చంద్రమిట్ట సుధాకర్, తన్నీరు సురేంద్ర, చిన్ని సుధీర్, రాజా సత్యనారాయణ, కొల్లా వెంకట సునీల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలు బైపాస్‌రోడ్డు వద్ద మంగళవారం జరిగిన ప్రమాదంలో గుర్తుతెలియని యువకుడు మృతిచెందాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో 25 – 30 సంవత్సరాల మధ్య వయసున్న యువకుడు చనిపోగా స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఎస్సై అజయ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను కడతేర్చిన భర్త



అమల మృతదేహం

నెల్లూరు(క్రైమ్): వేరే వారితో సన్నిహితంగా ఉండడం, తనపై పెట్టిన కేసు రాజీ చేసుకోకపోవడంతో కోపోద్రిక్తుడైన భర్త భార్యను దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన మంగళవారం నెల్లూరులోని భగత్‌సింగ్ కాలనీలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కోవూరు షుగర్ ఫ్యాక్టరీ ప్రాంతానికి చెందిన పి.అమల(37)కు గతంలో వివాహమైంది. ఆమెకు ప్రవీణ్ అనే కుమారుడు ఉన్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త నుంచి విడాకులు తీసుకుని కుమారుడితో కలిసి ఉంటోంది. ఈక్రమంలో ఆమెకు బాలాజీనగర్‌కు చెందిన కారు డ్రైవర్ కె.మునిరత్నంతో ఐదు సంవత్సరాల క్రితం పెద్దల సమక్షంలో రెండో వివాహమైంది. వారికి యోగేష్ అనే కుమారుడున్నాడు. కొంత కాలం వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం దంపతుల నడుమ విభేదాలు మొదలయ్యాయి. దీంతో అమల తన మొదటి కుమారుడితో కలిసి భగత్‌సింగ్‌కాలనీలో నివాసం ఉంటోండగా మునిరత్నం తన కుమారుడు యోగేష్‌తో కలిసి బాలాజీనగర్‌లోని తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. అమల భర్తపై వరకట్న వేధింపుల కేసు పెట్టింది. ప్రస్తుతం ఆ కేసు కోర్టులో విచారణలో ఉంది. తనకు కుమారుడిని ఇవ్వాలని పలుమార్లు ఆమె భర్తను అడిగింది. తనపై పెట్టిన కేసును రాజీచేసుకుంటే ఇస్తానని మునిరత్నం చెప్పేవాడు. అప్పుడప్పుడు అతను భార్య వద్దకు వచ్చి గొడవపడేవాడు. ఎవరితో వివాహేతర సంబంధం పెట్టుకున్నావు? కేసు రాజీ చేసుకోవాలని, లేదంటే చేంపేస్తానని కొట్టేవాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి మునిరత్నం అమల వద్దకు వచ్చి ఆమెను చంపేందుకు యత్నించాడు. దీంతో ఆమె తన కుమారుడితో కలిసి ఇంట్లో నుంచి పారిపోయి భగత్‌సింగ్ కాలనీలోని ఓ వెల్డింగ్ షాపులో తలదాచుకుంది. మంగళవారం ఉదయం ఇంటికి వెళ్లగా అక్కడే నక్కి ఉన్న మునిరత్నం ఆమెపై కత్తితో దాడి చేశాడు. సుత్తితో తలపై బలంగా కొట్టాడు. అమల రక్షించమని పెద్దగా కేకలు వేయగా చుట్టుపక్కల ఉండే అరుణ, భవానీ, హరిప్రసాద్‌లు వెళ్లేసరికి మునిరత్నం కత్తి, సుత్తి పట్టుకుని రక్తపు మరకలతో ఆమెను చంపేశానంటూ అరుస్తూ బయటకు వచ్చాడు. వారు లోనికి వెళ్లిచూడగా అమల రక్తపు మడుగులో పడి చనిపోయి ఉంది. దీంతో జరిగిన విషయాన్ని వారు స్థానిక 54/3వ వార్డు వీఆర్వో శ్రీదేవికి తెలియజేశారు. ఆమె నవాబుపేట పోలీసులకు సమాచారం అందించింది. ఇన్‌స్పెక్టర్ ఎం.బాబీ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఇన్‌స్పెక్టర్ బాబీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి దారుణ హత్య

• బంగారు నరుడు దోపిడీ

సంగం: మండలంలోని జెండాదిబ్బ హరిజనవాడలో ఓ వృద్ధురాలిని దుండగులు దారుణంగా హత్య చేసి బంగారు సరుడు దోచుకెళ్లారు. ఎస్సై నాగార్జునరెడ్డి కథనం మేరకు.. జెండాదిబ్బ హరిజనవాడలో సుబ్బమ్మ (60) అనే వృద్ధురాలు ఒంటరిగా నివాసం ఉంటోంది. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆమె కాళ్లు, చేతులు కట్టేసి చీరతో గొంతు నులిమి హత్య చేశారు. వృద్ధురాలి మెడలోని నాలుగు సవర్ల విలువైన సరుడును లాక్కొని మృతదేహాన్ని ఇంటి ఆవరణలో పడేసి వెళ్లిపోయారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబువి దిగజారుడు రాజకీయాలు



అయ్యగారిపాళెంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి. చిత్రంలో గురుమూర్తి

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: 'రైతులకు సబ్సిడీ విత్తనాల డబ్బు అందకుండా ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని ఆపిన దుర్మార్గుడు చంద్రబాబు నాయుడు. ఆయన దిగజారుడు రాజకీయాలు చేస్తూ ప్రజల చేత ఛీకొట్టించుకుంటున్నాడు' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నందివాయ, అయ్యగారిపాళెం, చాటగొట్ల, మరుపూరు గ్రామాల్లో మంత్రి మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల అవసరాల కోసం ప్రభుత్వం రూ.800 కోట్లు, విద్యార్థుల చదువుల కోసం చెల్లించాల్సిన విద్యాదీవెన నిధులను విడుదల చేస్తే చంద్రబాబు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి ఆపించాడన్నారు. ఈసీ కూడా బాబుకు వంత పాడుతున్నట్లుగా ఉందన్నారు. ఐదేళ్లుగా అమలు చేస్తున్న పథకాలకు సంబంధించిన నిధులను అడ్డుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని టీడీపీని ప్రశ్నించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజలను ఓట్లు అడుతున్నారన్నారు. తిరుపతి ఎంపీ అభ్యర్థి గురుమూర్తి తనకు సోదర సమానుడని, తనతోపాటు ఆయనకు కూడా ఓట్లు వేసి గెలిపించాల్సిందిగా మంత్రి విజ్ఞప్తి చేశారు. గురుమూర్తి మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో గోవర్ధన్ రెడ్డి అభివృద్ధి పనులు చేయించినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సంక్షేమం, అభివృద్ధి పనులు చేసి ప్రజల వద్దకు వస్తున్నట్టు వెల్లడించారు.

జనం లేని సభలు

టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి ఎక్కడకు వెళ్లినా జనం హాజరుకావడం లేదని కాకాణి అన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి ఇంట్లో తాను కుటుంబసభ్యుడిగా మారినట్లు తెలిపారు. తన తండ్రి కాకాణి రమణారెడ్డికి నందివాయ, అయ్యగారిపాళెం, చాటగొట్ల అంటే ప్రత్యేక అభిమానమన్నారు. మంత్రికి నాయకులు, కార్యకర్తలు, మహిళలు స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు నిర్మలమ్మ, చెంచురామయ్య, శ్రీధర్ రెడ్డి, ఎం.గోపాలయ్య, కె.పెంచలభాస్కర్, విజయభాస్కర్, పెంచలయ్య, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, వక్లూరు గోపాల్ రెడ్డి, విజయ్‌రెడ్డి, సుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి ఓట్లేస్తే సంక్షేమ పథకాలు రద్దే..



ఎన్నికల ప్రచారం చేస్తున్న ప్రసన్న, నాయకులు, కార్యకర్తలు

• వైఎస్సార్‌సీపీ కోవూరు అభ్యర్థి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: 'తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేస్తే సంక్షేమ పథకాలను చంద్రబాబు నాయుడు రద్దు చేస్తాడు. 2014 – 19 వరకు చేసిన రాక్షస పాలనను మళ్లీ తెస్తాడు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి' అని వైఎస్సార్‌సీపీ కోవూరు అసెంబ్లీ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని తూర్పు అరుంధతీయవాడ, చుండుగుంట, ఇంద్రలోక్ అవెన్యూ, విష్ణువర్ధపురం, చెర్లోపాళెం, రామనాథపురం గ్రామాల్లో మంగళవారం మల్లవరపు చిరంజీవి, మందా రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారాల్లో ప్రసన్న మాట్లాడారు. చంద్రబాబు తరహాలో ప్రజలను మోసం చేయడం జగన్‌కు చేతకాదని చెప్పారు. ఊసరవెల్లిలా రంగులు మార్చడం బాబు నైజమని మండిపడ్డారు. కరోనా సమయంలో ప్రతిపక్ష నాయకులు ప్రజలకు కనిపించలేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రాణాలకు తెగించి సేవలదించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతిపక్షాలను నమ్మే పరిస్థితిలో రాష్ట్ర ప్రజలు లేరన్నారు. జగన్ రెండోసారి ముఖ్యమంత్రి కావాలని వారు ఆకాంక్షిస్తున్నారన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. సీఎం కుర్చీ కోసం ఎంతకైనా దిగజారడం చంద్రబాబు నైజమని, అందుకే బీజేపీ, జనసేనతో పొత్తు పెట్టుకున్నాడని విమర్శించారు. అంతటితో ఆగకుండా షర్మిలను పీసీసీ అధ్యక్షురాలిని చేశారన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు రాకుండా టీడీపీ అడ్డుకున్నట్లు చెప్పారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి రాజ్యసభ, ఆయన భార్య ప్రశాంతిరెడ్డికి టీటీడీ పదవులను జగన్ ఇచ్చారన్నారు. అయితే నెల్లూరు సిటీ, కందుకూరు టికెట్లను మైనార్టీ, బీసీకి కేటాయించారనే కారణంతో వారు పార్టీని వీడారని స్పష్టం చేశారు. కోవూరు నియోజకవర్గ ప్రజలు చైతన్యవంతులని, అలాంటి వారికి ఓటుతో గుణపాఠం చెబుతారన్నారు. స్థానిక నాయకుల ఆధ్వర్యంలో 300 మోటార్‌బైక్‌లతో ఇనముడుగు సెంటర్‌నుంచి విష్ణువర్ధపురం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీపీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీఏబీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, అంజన్‌రావు, శ్రీనివాసులు, హరిబాబు, ప్రశాంత్, మౌళి, గోవర్ధన్, శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, చంద్ర, మల్లి, బ్రహ్మయ్య, అజిత్, ప్రసాద్, శంకర్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేయడమే లక్ష్యం

• వైఎస్సార్‌సీపీ రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: 'ప్రజలకు మంచి చేయడమే నా లక్ష్యం . రూరల్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తా' అని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్ రెడ్డి అన్నారు. నెల్లూరులోని జీపీఆర్ కళ్యాణ మండపంలో మంగళవారం శ్రేయ రియల్ ఎస్టేట్స్ అసోసియేట్స్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ ఇవే నా చివరి ఎన్నికలు. దౌర్జన్యాలు, అవినీతి చేసే వ్యక్తిపై పోటీ చేయాల్సిన పరిస్థితి రావడం అత్యంత బాధాకరంగా ఉందన్నారు. ప్రజలు తనకు, టీడీపీ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డికి మధ్య తేడాను గమనించాలని కోరారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సీటు ఇచ్చిందన్నారు. ఈ ప్రభుత్వంలో అయన భార్య ప్రశాంతిరెడ్డికి టీటీడీ బోర్డు పదవి దక్కిందన్నారు. అయితే వారికి ఆ విశ్వాసం లేకుండా పోయిందన్నారు. సామాన్య ముస్లింకు నెల్లూరు సిటీ ఇచ్చారని అక్కసుతో టీడీపీలో చేరి నీడనిచ్చిన పార్టీపైనే పోటీ చేస్తున్నారన్నారు. అటువంటి వారికి ఓటుతో తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముస్లింలు ఐక్యంగా ఉండి ఖలీల్ అహ్మద్‌ను గెలిపించాలని కోరారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 2019 నాటి ఫలితాలే పునరావృతం అవుతాయన్నారు.

జగన్ చేసిన మంచి గుర్తు చేసుకోవాలి

ఓటు వేసే ముందు ప్రతి ఒక్కరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని గుర్తు తెచ్చుకోవాలని వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆమె మాట్లాడుతూ నెల్లూరు పార్లమెంట్ పరిధిలో అభివృద్ధికి విజయసాయిరెడ్డి ఒక విజన్‌తో ముందుకెళ్తున్నారని చెప్పారు. ఎక్కడా లేని విధంగా ప్రత్యేక మేనిఫెస్టో రూపొందించారన్నారు. ఆయన్ను గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి జిల్లా రుణం తీర్చుకుంటారన్నారు. కార్యక్రమంలో మేయర్ స్రవంతి, విజయసాయిరెడ్డి సతీమణి సునందారెడ్డి, 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్, ప్రొఫెసర్ డాక్టర్ వసుంధర, శ్రేయ రియల్ ఎస్టేట్ అసోసియేట్స్ అధినేత బాబు ఆగస్టస్, నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, వైవీ రామిరెడ్డి, లంకా రామశివారెడ్డి, బి.శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మీసునంద, వారాల లక్ష్మీనారాయణ, కల్లూరు లక్ష్మీరెడ్డి, శ్రేయ రియల్ ఎస్టేట్ అసోసియేట్ సభ్యులు పాల్గొన్నారు.

రైతుబజార్‌ను మరింత అభివృద్ధి చేస్తా



వ్యాపారులతో మాట్లాడుతున్న రామిరెడ్డి

కావలి: పట్టణంలోని రైతుబజార్‌ను మరింతగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆయన మంగళవారం అక్కడికి వెళ్లి వ్యాపారులతో మాట్లాడారు. రైతుబజార్‌ను తీసేస్తున్నారని టీడీపీ చేస్తున్న ప్రచారంలో నిజం లేదన్నారు. వారి మాటల్ని నమ్మొద్దని కోరారు. బజార్ ఇక్కడే ఉంటుందని, ఇంకా అభివృద్ధి చేయాడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తప్పుడు ప్రచారాలు చేస్తున్న తెలుగుదేశానికి గుణపాఠం చెప్పాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అండగా నిలిచి ఎన్నో సంక్షేమ పథకాలను అందజేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులున్నారు.

బాబుకు ఓట్లేస్తే జన్మభూమి కమిటీలదే పెత్తనం

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సంగం: 'సంక్షేమ పథకాల నగదు లబ్ధిదారులకు అందకుండా చంద్రబాబు నాయుడు ఈసీకి లేఖ రాసి ఆపించారు. ఎన్నికల్లో పొరపాటున టీడీపీకి ఓట్లు వేస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు పెత్తనం చేస్తాయి. ప్రజలంతా ఇబ్బంది పడాల్సి వస్తుంది' అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. సంగం మండలంలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్‌పై ప్రజలకు ఎంతో నమ్మకం ఉందన్నారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా మేనిఫెస్టోను విడుదల చేశారన్నారు. ప్రతి ఓటరు గత టీడీపీ పాలన, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనను పోల్చి చూడాలన్నారు. చంద్రబాబు రైతులకు, పొదుపు మహిళలకు రుణమాఫీ చేస్తానని మోసం చేశాడన్నారు. ఈసారి ఆయన ప్రకటించిన పథకాలను ప్రజలు నమ్మే పరిస్థితి ఏ మాత్రం కనిపించడం లేదన్నారు. ఒక్క రూపాయి అవినీతికి ఆస్కారం లేకుండా జగనన్న పథకాలను అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాల్సిన బాధ్యత మహిళలపై ఉందన్నారు. పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం చంద్రబాబుకు ఏ మాత్రం ఇష్టం లేదన్నారు. ఫ్యాన్ గాలికి రాష్ట్రంలో ప్రతిపక్షాలకు డిపాజిట్లు గల్లంతవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి, రావుల ప్రసాద్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ దేవసహాయం, పీఏసీఎస్ అధ్యక్షుడు పందిళ్లపల్లి శివకుమార్ రెడ్డి, కోటారెడ్డి, సర్పంచ్ మానికల చందన్ కుమార్, దేవవరమ్మ పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి నారాయణను నమ్మొద్దు

• వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్



మహిళకు కరపత్రం అందజేస్తున్న నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్, నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): '2019 ఎన్నికలయ్యాక టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ ప్రజలకు కనిపించలేదు. ఎన్నికల సమయంలో వచ్చి అది చేస్తా.. ఇది చేస్తానంటున్నాడు. ఆయన్ను నమ్మొద్దు' అని వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్ అన్నారు. మంగళవారం ఆయన నగరంలోని 14, 54, 8, 16వ డివిజన్లలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. నగర వాసులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ప్రజలకు తనను నేరుగా కలిసి సమస్యలు చెప్పొచ్చని, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నారాయణను ప్రజలు కలిసే పరిస్థితి ఉండదన్నారు. నగరంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరాయన్నారు. నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డిని, సిటీ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కర్తం ప్రతాప్‌రెడ్డి, షేక్ సఫియా బేగం, మొగళ్లపల్లి కామాక్షీదేవి, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ జమీర్, నాయకులు దొంతాలి రఘు తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి నియోజకవర్గంపై స్పెషల్ ఫోకస్

• వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి



ప్రచారం చేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, నాయకులు

కలిగిరి: ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉదయగిరి నియోజకవర్గంపై ప్రత్యేక ఫోకస్ పెట్టి విధాలా అభివృద్ధి చేస్తానని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గంగిరెడ్డిపాళెం, కావలిముస్తాపురం, క్రాకుటూరు, అనంతపురం పంచాయతీల్లో మంగళవారం ఆయన విజయ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మరింత మేలు చేకూర్చేలా వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీర్చిదిద్దారన్నారు. చంద్రబాబు ఎన్ని మాటలు చెప్పినా ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదన్నారు. అమలు చేయలేని విధంగా కూటమి మేనిఫెస్టో ఉందన్నారు. ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే మండలంలో అవకాశమున్న చెరువులకు సోమశిల జలాలు తరలించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరి మాల్యాద్రిరెడ్డి, మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, ఎంపీటీసీలు హరిశ్చంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు మాలేపాటి వెంకటసుబ్బయ్య, మెట్టుకూరు భాస్కర్‌రెడ్డి, ఎంపీ రామిరెడ్డి, దేవిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, రాంజీవిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు బరిలో కొత్త తరం

- ఇప్పటి వరకు మానుగుంట, దివి కుటుంబాలే ఆధిపత్యం
- టీడీపీ ఆవిర్భావం తర్వాత తొమ్మిది సార్లు ఎన్నికలు
- కేవలం రెండు దఫాలే టీడీపీకి విజయం
- వైఎస్సార్‌సీపీ ఆవిర్భావంతో పూర్తిగా మారిన రాజకీయ ముఖచిత్రం
- 2024 ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని రంగంలోకి దించిన వైఎస్సార్‌సీపీ
- హ్యాట్రిక్ విజయం దిశగా దూసుకెళ్తున్న పార్టీ

దశాబ్దాల పాటు కేవలం రెండు కుటుంబాల ఆధిపత్యం సాగిన కందుకూరులో మొదటి సారిగా ఆ రెండు కుటుంబాలు ఎన్నికల బరిలో లేకుండా 2024 ఎన్నికలు జరుగుతున్నాయి. నియోజకవర్గంలో రాజకీయాన్ని శాసించిన మానుగుంట, దివి కుటుంబాలు కాదని, రెండు ప్రధాన పార్టీలు కొత్త తరం అభ్యర్థులను బరిలోకి దించాయి. వరుస ఓటములతో 2014 ఎన్నికల తర్వాత నుంచి దివి కుటుంబ రాజకీయ ప్రస్థానం ముగించింది. అయితే మానుగుంట కుటుంబం కొన్ని రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ప్రస్తుతం ప్రత్యక్ష ఎన్నికల్లో లేకపోయినా తమ పార్టీ అభ్యర్థి విజయానికి పోరాడుతోంది. ప్రస్తుత ఎన్నికలతో కొత్త తరం రాజకీయ చరిత్రకు నాంది పలికినట్లు అయింది. ఆనవాయితీ ప్రకారం మరో సారి టీడీపీ కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఇంటూరి నాగేశ్వరరావుకు టికెట్ ఇస్తే, వైఎస్సార్‌సీపీ మాత్రం బీసీ వర్గానికి చెందిన బుర్రా మధుసూదన్ యాదవ్‌కు కేటాయించింది. వైఎస్సార్‌సీపీకి కంచుకోట అయిన కందుకూరులో మరోసారి టీడీపీకి ఓటమి తప్పదనే అంచనాలు ఉన్నాయి.



కందుకూరు నియోజకవర్గ మ్యాప్

కందుకూరు: రాష్ట్ర రాజకీయాల్లో కందుకూరు నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. ఆది నుంచి ఇక్కడ రాజకీయాల్లో రెండు సామాజికవర్గాల్లోని రెండు కుటుంబాలదే ఆధిపత్యంగా సాగింది. మానుగుంట, దివి కుటుంబాలకు చెందిన వ్యక్తులే నియోజకవర్గంలో రాజకీయాన్ని శాసించారు. నలమోతు చెంచురామానాయుడు మూడు దఫాలు ఎమ్మెల్యేగా ఎన్నికై నా.. ఆ తర్వాత ఆ కుటుంబం రాజకీయంగా తెర వెనుకకు వెళ్లిపోయింది. 1952లో ద్విసభ్య నియోజకవర్గంగా ఆవిర్భావించిన కందుకూరు, ఆ తర్వాత , 1957 నుంచి ఏక సభ్య నియోజకవర్గంగా మారింది. ఆ నాటి నుంచి మానుగుంట, దివి కుటుంబాలే కందుకూరు రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం దివి కుటుంబం రాజకీయాలకు దూరం కాగా, మానుగుంట కుటుంబ మాత్రం కందుకూరు రాజకీయాన్ని శాసించే స్థితిలోనే ఉంది.

మానుగుంట కుటుంబానిదే ఆధిపత్యం

కందుకూరు నియోజకవర్గాన్ని అత్యధికంగా మానుగుంట కుటుంబమే శాసించిందని చెప్పారు. ఈ నియోజకవర్గం ఆవిర్భవించినప్పటి నుంచి 15 దఫాలు ఎన్నికలు జరిగితే.. మానుగుంట ఆదినారాయణరెడ్డి మూడు దఫాలు, ఆయన తనయుడు మహీదర్‌రెడ్డి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆది నుంచి మానుగుంట కుటుంబం అన్ని వర్గాల ప్రజలకు దగ్గరగా ఉండేది. ఈ నియోజకవర్గంలో రెడ్డి సామాజిక వర్గం ఓటర్లు తక్కువే అయినా తొలి నుంచి ఆదినారాయణరెడ్డికి ప్రజలతో పెనవేసుకున్న అనుబంధం ఆ కుటుంబానికి పట్టం కట్టుతూ వచ్చింది. ఈ నియోజకవర్గంలో దివి కుటుంబం రాజకీయాన్ని శాసించినా.. నిలదొక్కుకోలేకపోయింది. కందుకూరు 1957లో ఏకసభ్య నియోజకవర్గంగా మారాక రాజకీయ ఆరంగేట్రం చేసిన దివి కొండయ్య చౌదరి తొలి ప్రయత్నంలోనే విజయం సాధించినా.. ఆ తర్వాత మరో 21 ఏళ్ల పాటు అధికారాన్ని చేజిక్కించుకోలేకపోయారు. 1978లో మరో సారి దివి కొండయ్య చౌదరి గెలిచారు. తండ్రి రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్న దివి శివరామ్‌కు కూడా అంత తేలికగా విజయ దక్కలేదు. పన్నెండేళ్ల తర్వాత 1994లో తొలిసారిగా గెలిచారు. 1999 ఎన్నికల్లోనూ ఆయనే మరోసారి గెలిచినా.. ఆ తర్వాత నుంచి ఆయన్ను వరుస ఓటములు వెంటాడాయి. దీంతో రాజకీయాల నుంచి పూర్తిగా వైదొలిగారు. ఈ నియోజకవర్గంలో మరో నేత నలమోతు చెంచు రామానాయుడు గురించి చెప్పుకోవాలి. మానుగుంట, దివి కుటుంబాల కంటే ముందు రాజకీయాల్లోకి వచ్చిన చెంచురామానాడు 1952లో ద్విసభ్య నియోజకవర్గంగా ఉన్నప్పుడు తొలిసారిగా పోటీ చేసి విజయ సాధించారు. ఆ తర్వాతి ఎన్నికల్లో ఓటమి పాలైనా.. 1962, 1967లో జరిగిన రెండు ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేశారు. ఇలా మూడు దఫాలు చెంచురామానాయుడు ఎమ్మెల్యేగా ఎన్నికై నా ఆ కుటుంబం ప్రస్తుతం రాజకీయంగా తెరమరుగైంది.

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావంతో మారిన ముఖచిత్రం

దశాబ్దాల పాటు రెండు కుటుంబాల ఆధిపత్యానికి కేంద్రంగా ఉన్న కందుకూరు రాజకీయం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావంతో రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. రాష్ట్ర విభజనతో నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో 2014లో ఎన్నికలకు మానుగుంట మహీధర్‌రెడ్డి దూరంగా ఉన్నారు. ఆ ఎన్నికల్లో పోతుల రామారావు వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేయగా, టీడీపీ నుంచి దివి శివరాం పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో దివి శివరాం ఓడిపోవడంతో రాజకీయానికి శాశ్వతంగా ఫుల్ స్టాప్ పడింది. వరుస ఓటములతో 2019 ఎన్నికల్లో దివి శివరామ్‌కు టీడీపీ అధిష్టానం టికెట్ నిరాకరించి, వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన పోతుల రామారావుకు టికెట్ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి మానుగుంట మహీధ రెడ్డి బరిలో నిలిచి ఘన విజయం సాధించారు. అయితే 2024 ఎన్నికల్లో కొన్ని రాజకీయ సమీకరణాల నేపథ్యంలో బీసీ అభ్యర్థికి అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ అధిష్టానం బుర్రా మధుసూదన్ యాదవ్‌కు అవకాశం కల్పించింది.టీడీపీ సైతం కొత్త అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు టికెట్ ఇచ్చింది. దాదాపు ఐదు దశా బ్దాల పాటు నియోజకవర్గ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించిన దివి, మానుగుంట కుటుంబాలు బరిలో లేకుండా ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. నియోజకవర్గ ఆవిర్భావం నుంచి ఇప్పటికే వరకు ఓసీ వర్గానికి చెందిన వ్యక్తులే రాజకీయాన్ని శాసిస్తుండగా వైఎస్సార్‌సీపీ మొదటి సారి ఓ బీసీ అభ్యర్థికి అవకాశం కల్పించడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.


మానుగుంట ఆదినారాయణరెడ్డి


దివి కొండయ్య చౌదరి


మానుగుంట మహీధర్ రెడ్డి


దివి శివరాం


పోతుల రామారావు


బుర్రా మధుసూదన్ యాదవ్

టీడీపీకి రెండు సార్లే విజయం

కందుకూరు నియోజకవర్గ రాజకీయ చరిత్రలో టీడీపీకి కేవలం రెండు సార్లు మాత్రమే విజయం దక్కింది. ఆ పార్టీ నియోజకవర్గంలో ఎంత గడ్డు పరిస్థితి ఎదుర్కొంటుందో అర్థం చేసుకోవచ్చు. 1983లో టీడీపీ ఆవిర్భావం తర్వాత 9 సార్లు ఎన్నికలు జరిగాయి. 1994, 1999 ఎన్నికల్లో మాత్రమే ఆ పార్టీ విజయం సాధించింది. మిగిలిన అన్ని సందర్భాల్లో ఆ పార్టీ ఓడిపోయింది. ప్రస్తుతం ఎన్నికల్లో మరోసారి ఓటమి తప్పదనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున బీసీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్, టీడీపీ నుంచి ఇంటూరి నాగేశ్వరరావు పోటీలో ఉన్నారు. బీసీ అభ్యర్థి కాన్సెప్ట్‌తో పాటు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, నియోజకవర్గ అభివృద్ధి ఈ ఎన్నికల్లో బుర్రాకు కలిసి వస్తాయని భావిస్తుండగా, అంతర్గత కుమ్ములాటలతో టీడీపీ పోరాటం చేస్తోంది. ఈ నేపథ్యంలో వరుసగా మూడోసారి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలిచి హ్యాట్రిక్ సాధిస్తుందని విశ్లేషణలు వెలువడుతున్నాయి.

వైఎస్సార్‌సీపీని దీవించండి

- జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి


మాట్లాడుతున్న జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని పాస్టర్లు దీవించి ఆదరించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. మంగళవారం నగరంలోని ఎంసీఎస్ కల్యాణ మండపంలో పాస్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో పాస్టర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పర్వతరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభివృద్ధి కోసం మహోన్నతమైన నవరత్నాల పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. దీంతో పాటు కరోనా కష్టకాలం సైతం అధికమించి పథకాలన్నీ సజావుగా అందజేశారన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా పాస్టర్లకు భరోసా కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిదేనన్నారు. జిల్లాలో పాస్టర్లు వైఎస్సార్‌సీపీ దీవించి పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డితో పాటు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్‌ను గెలిపించేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, 51వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సర్వేపల్లి ఉద్దండ నేతల బరి

- రాజకీయ చిత్రపటంలో ప్రత్యేక స్థానం



- చిన్న గ్రామం పేరుతో నియోజకవర్గం ఏర్పాటు
- 2009లో మారిన నియోజకవర్గ స్వరూపం

పొదలకూరు : జిల్లా రాజకీయ చిత్రపటంలో సర్వేపల్లి నియోకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. 1955లో సర్వేపల్లి నియోజకవర్గం ఏర్పడింది. అప్పట్లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా వెంకటాచలం మండలంలోని సర్వేపల్లి అనే గ్రామాన్ని నియోజకవర్గ కేంద్రంగా ఎంపిక చేశారు. ఇప్పటికీ 5 వేల మంది జనాభా కలిగిన మైనర్ పంచాయతీ నియోజకవర్గ కేంద్రంగా విరాజిల్లుతోంది. నియోజకవర్గంలో పొదలకూరు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, వెంకటాచలం, మనుబోలు మండలాలు ఉన్నాయి. 2009 అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనకు ముందు ఈ నియోజకవర్గంలో మనుబోలు, పొదలకూరు మండలాలు లేవు.

ఎమ్మెల్యేగా ఉద్దండులు పోటీ

1955లో నియోజకవర్గం ఆవిర్భవించింది. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో డాక్టర్ బెజవాడ గోపాల్‌రెడ్డి ఆత్మకూరు, సర్వేపల్లి నుంచి పోటీ చేసి గెలుపొందారు. అనంతరం సర్వేపల్లి స్థానానికి గోపాల్‌రెడ్డి రాజీనామా చేశారు. ఈ క్రమంలో జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ నేత సోమిరెడ్డి పెదనాన్న సోమిరెడ్డి ఆదినారాయణరెడ్డి, టీపీ గూడూరుకు చెందిన వంగల్లు కోదండరామిరెడ్డి పోటీ పడ్డారు. 7 వేల ఓట్ల మెజారిటీతో కోదండరామిరెడ్డి విజయం సాధించారు.

➡ 1962 ఎన్నికల్లో టీపీగూడూరు మండలం పాపిరెడ్డిపాళేంకు చెందిన వేమారెడ్డి వెంకురెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి సిట్టింగ్ ఎమ్మెల్యే కోదండరామిరెడ్డిపై 86 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

➡ 1967లో సర్వేపల్లి ఎస్సీలకు రిజర్వ్ అయ్యింది. ఇందుకూరుపేట మండలం పల్లెపాడుకు చెందిన స్వర్ణ వేమయ్య ఇండిపెండెంట్ అభ్యర్థి జోగి శంకరరావుపై 266 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

➡ 1972 ఎన్నికల్లో అల్లూరు మండలం ఇస్కపల్లికు చెందిన మంగళగిరి నానాదాసు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. 23 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో స్వర్ణ వేమయ్యపై గెలుపొందారు.

➡ 1978లో సామాన్య రైతు కుటుంబం నుంచి చిత్తూరు వెంకట శేషారెడ్డి (సీవీ శేషారెడ్డి) బరిలోకి దిగారు. మడమనూరు, పంటపాళేం సర్పంచ్‌గా పని చేశారు. ఆయన ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థిగా తన రాజకీయ గురువు ఆనం భక్తవత్సలరెడ్డి, ఉద్దండుడైన గునపాటి రామచంద్రారెడ్డితో తలపడ్డారు. 21,962 ఓట్ల మెజారిటీతో శేషారెడ్డి విజయం సాధించారు.

➡ 1983లో ఎన్టీఆర్ ప్రభంజనంలో టీపీ గూడూరు మండలం రావూరువారి కండ్రికకు చెందిన న్యాయవాది చెన్నారెడ్డి పెంచలరెడ్డి టీడీపీ అభ్యర్థిగా 15,277 ఓట్ల మెజారిటీతో సీవీ శేషారెడ్డిపై విజయం సాధించారు.

➡ 1985లో జరిగిన ఎన్నికల్లో ముత్తుకూరుకు చెందిన వ్యవసాయ పట్టభద్రుడు ఈదూరు రామకష్టారెడ్డి టీడీపీ తరఫున పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కోటారెడ్డి విజయకుమార్‌రెడ్డిపై 21,566 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

➡ 1989లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన సీవీ శేషారెడ్డి టీడీపీ అభ్యర్థి పూండ్ల దశరథరామిరెడ్డిపై 13,148 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

➡ 1994 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సీవీ శేషారెడ్డిపై సోమిరెడ్డి 33,775 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు.

➡ 1999 ఎన్నికల్లో కూడా సోమిరెడ్డి రెండో పర్యాయం శేషారెడ్డిపై పోటీ చేసి 16,902 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

➡ 2004లో ఆదాల ప్రభాకర్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలోకి దిగి సోమిరెడ్డి దూకుడుకు కళ్లెం వేశారు. 2004 ఎన్నికల్లో సోమిరెడ్డిపై 7,599 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2009 లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డిపై వరుసగా రెండో పర్యాయం 10,256 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

➡ 2014 ఎన్నికల బరిలో నెల్లూరు జెడ్పీ చైర్మన్‌గా పని చేసిన సొంత నియోజకవర్గానికి చెందిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డిపై 5,451 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2019 ఎన్నికల్లో వరుసగా రెండో పర్యాయం కాకాణి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో నిలిచి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డిపై 14 వేల ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు.

పాతకాపుల మధ్యే పోటీ

సర్వేపల్లిలో పాతకాపుల మధ్యే పోటీ నెలకొంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సర్వేపల్లి బరిలో ఉన్నారు. ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో అదృష్టాన్ని పరీక్షించుకోనేందుకు సిద్ధంగా ఉన్నారు. సోమిరెడ్డి వరుసగా సర్వేపల్లి నుంచి నాలుగు పర్యాయాలు ఓటమి చెందడం, రాజకీయ చతురత ప్రదర్శించడంలో వెనకబడడం ఆయన గెలుపునకు పెద్ద ఆటంకంగా ఏర్పడింది. కాకాణి వరుసగా రెండు పర్యాయాలు గెలుపొందడం, రాజకీయ చాణక్యుడిగా పేరు ఉండడంతో పాటు సర్వేపల్లిని ఊహించని విధంగా అభివృద్ధి చేసి గెలుపు దిశగా దూసుకుపోతున్నారు.

నెల్లూరు రూరల్‌లో ఎగిరే జెండా వైఎస్సార్‌సీపీదే!

నెల్లూరురూరల్ నియోజకవర్గం ఆవిర్భావం నుంచి 'వైఎస్' కుటుంబ చరిష్మాదే విజయంగా మారింది. ఈ నియోజకవర్గంలో టీడీపీకి స్థానం లేదని గత మూడు దఫాల ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయి. ఆ పార్టీ సైతం ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి సాహసించలేక పొత్తు పెట్టుకున్న పార్టీలకు కేటాయించి చేతలు దులుపుకుంది. గత ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు లేకపోవడంతో ఒంటరిగా పోటీ చేస్తే 22,776 ఓట్ల తేడాతో ఓడిపోయింది. ఈ దఫా కూడా ఇక్కడ వైఎస్సార్‌సీపీదే విజయమని రాజకీయ పండితుల అంచనాలు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డికి అప్రతిహత విజేతగా, రాజకీయ దురందుడుగా పేరుదొంది. వైఎస్సార్‌సీపీ ఐదేళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమం, అభ్యర్థి క్రెడిబులిటి ఆ పార్టీ విజయం లాంఛనమే అని స్పష్టంగా కనిపిస్తోంది.

- మూడు దఫాల ఎన్నికల్లో 'వైఎస్' చరిష్మాదే విజయం
- 2019 తొలిసారిగా 'సైకిల్' సింబల్‌తో టీడీపీ పోటీ చేసి ఓటమి
- అంతకు ముందు కూటమికి మద్దతిచ్చినా ఓట్ల శాతానికి ఆమడ దూరం

అప్రతిహత విజేత 'ఆదాల'



నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ స్థానం నుంచి ప్రస్తుత ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆదాల రాజకీయ ఆరంగేట్రం చేసినప్పటి నుంచి అజాత శత్రువుగా పేరు తెచ్చుకున్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా, ఒక సారి మంత్రిగా, ఒక ఎంపీగా గెలిచారు. రాజకీయ దురందుడు అనే పేరు కూడా ఉంది. ప్రధానంగా నెల్లూరు రూరల్ నుంచి గతంలో వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి టీడీపీలో చేరిన కోటంరెడ్డి ప్రస్తుతం ఆదాలకు ప్రత్యర్థిగా బరిలో ఉన్నారు. అయితే ప్రస్తుతం కోటంరెడ్డి టీడీపీ నుంచి బరిలో ఉండడమే ఇక్కడ వైఎస్సార్‌సీపీకి మొదటి ప్లస్‌గా చెప్పొచ్చు. రెండోది టీడీపీ అభ్యర్థి కావడం, ఆ పార్టీపై ప్రజల్లో విశ్వసనీయత లేదు.

టీడీపీకి ఓటమి భయం

2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో జనాభా ప్రాతిపదికన నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఏర్పడింది. ఇక్కడ నుంచి పోటీ చేయడానికి టీడీపీకి ఓటమి భయం వెంటాడుతోంది. ఇప్పటికి మూడు దఫాలు ఎన్నికలు జరిగితే ఒంటరిగా పోటీ చేయడానికి టీడీపీ వెనుకాడుతోంది. ఈ నియోజకవర్గ పరిధిలో ఆ పార్టీ క్షేత్రస్థాయిలో బలహీనంగా ఉంది. మొదటి సారి వైఎస్ రాజశేఖరరెడ్డి, రెండు దఫాలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిష్మాకు ప్రజలు స్పష్టమైన మెజారిటీ ఇచ్చారు.

➡ 2009లో తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో దివంగత ఆనం వివేకాందరెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పాటు ప్రజారాజ్యం పార్టీ, టీడీపీ, సీపీఎం, సీపీఐ కూటమి తరఫున సీపీఎం పోటీ చేశాయి. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చరిష్మాతో కాంగ్రెస్ విజయం సాధించగా, రెండో స్థానంలో పీఆర్‌పీ నిలిచింది. ఇక టీడీపీ మద్దతు ఇచ్చిన సీపీఎం అయితే డిపాజిట్లు కూడా దక్కించుకోలేకపోయింది.

➡ 2014లో ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో కూడా టీడీపీ ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేక టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి తరఫున బీజేపీకి కేటాయించింది. ఆ ఎన్నికల్లో మూడు పార్టీలు కలిసి పోరాడినా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దాదాపు 24 వేల ఓట్ల పైచిలుకు మెజార్టీతో విజయం సాధించారు.

➡ 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి మరోసారి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పోటీ చేయగా, టీడీపీ అనివార్య పరిస్థితుల్లో ఒంటరిగానే పోటీ చేసింది. గడిచిన రెండు దఫాల ఎన్నికల్లో ఓటమికి భయపడే పొత్తు పెట్టుకున్న పార్టీలకు ఇచ్చేసి చేతులు దులుపుకుంది. ఆ ఎన్నికల్లోనూ టీడీపీపై వైఎస్సార్‌సీపీ సుమారు 23 వేల ఓట్ల తేడాతో విజయం సాధించింది.

తాజాగా జరుగుతున్న ఎన్నికల్లో మొన్నటి వరకు ఈ దఫా విజయం ఖాయమనే ధీమాతో ఉన్న టీడీపీకి ఇప్పుడు వెన్నులో వణుకు ప్రారంభమైంది. ప్రధానంగా టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉండి చేసిన అవినీతి, అరాచకాలు మితిమీరడంతోనే వైఎస్సార్‌సీపీ ఆయన్ను పక్కన పెట్టింది. దీంతో ఆయన టీడీపీలో చేరారు. రెండు గెలిచిన కోటంరెడ్డి ఈ దఫా టీడీపీ నుంచి గెలుస్తాడంటూ ఊదరగొట్టేసింది. కోటంరెడ్డిని బరిలో నిలబెడితే ఆయన చేసిన అవినీతి, అరాచకాలతో ఆయన్ను ప్రజలు ఓడించడం ఖాయమనే సంకేతాలు ఉండడంతోనే వైఎస్సార్‌సీపీ దూరం పెట్టింది. వైఎస్సార్‌సీపీకి పనికి రాని పువ్వు.. టీడీపీలో విరబూస్తుందా? అని స్థానిక ప్రజలు నవ్వుకుంటున్నారు. ఈ దఫా వైఎస్సార్‌సీపీ వివాదారహితుడు, అజాత శత్రువు, రాజకీయ దురందుడు అయిన ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని బరిలో నిలబెట్టడంతో వార్ వన్‌సైడ్‌గా మారిపోయింది.

ఆదాల,వైఎస్సార్‌సీపీ బలం.. విజయం ఖాయం

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ క్షేత్రస్థాయిలో మొదటి నుంచి బలంగా ఉంది. గడిచిన ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చింది. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 2,81,008 మంది ఓటర్లు ఉంటే.. ప్రతి కుటుంబానికి రెండు.. అంతకు మించిన సంక్షేమ పథకాలు అందాయి. ప్రధానంగా రూ.లక్షల విలువైన ఇంటి స్థలాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించింది. దీంతో వైఎస్సార్‌సీపీ పాలనపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆ పార్టీ ఓటు బ్యాంక్‌ను మరింతగా పెరిగిందని రాజకీయ విశ్లేషకుల అంచనా. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్ రెడ్డి వ్యక్తిగత ప్రతిష్ట, 10 నెలల్లో రూరల్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులు గెలుపు లాంఛనమే అని విస్పష్టంగా వ్యక్తమవుతోంది. మరో వైపు కోటంరెడ్డి సోదరులు సాగించిన అరాచకాలు కూడా వైఎస్సార్‌సీపీకి అనుకూల వాతావరణంగా కనిపిస్తోంది. ప్రజలు ఈ సారి కూడా స్పష్టమైన నిర్ణయాన్ని తమ ఓటు ద్వారా చెప్పనున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధి

పథకం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
డీబీటీ ద్వారా..		
జగనన్న అమ్మఒడి	1,79,295	2.25
జగనన్న విద్యాదీవెన	1,25,230	12.87
జగనన్న వసతి దీవెన	1,07,270	4.89
జగనన్న విదేశీ దీవెన	08	0.50
వైఎస్సార్ రైతుభరోసా	87,770	82.82
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	13,470	0.29
వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాలు	3,975	0.68
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	1,678	7.92
వైఎస్సార్ మత్స్యకార భరోసా	1,872	52.7
వైఎస్సార్ ఆసరా	1,82,503	68.53
వైఎస్సార్ సున్నావడ్డీ	2,36,514	24.87
వైఎస్సార్ కాపు నేస్తం	9,013	8.17
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	27,604	60.18
వైఎస్సార్‌కల్యాణమస్తు	24	0.93
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	32,170	72.68
హౌసింగ్	59,702	65.25
వైఎస్సార్ బీమా	3,871	69.12
వైఎస్సార్ వాహనమిత్ర	22,471	0.68
వైఎస్సార్ నేతన్న నేస్తం	1,172	1.07
జగనన్న చేదోడు	21,470	0.58
ప్రత్యేక కోవిడ్ సహాయం	3,29,741	40.78
జగనన్న తోడు	17,471	0.42
వైఎస్సార్ పెన్షన్ కానుక	48,109	14.42
వైఎస్సార్ చేయూత	21,634	40.58
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	35,144	91.388
నాన్ డీబీటీ ద్వారా..		
ఇంటి స్థలాలు	68,474	87.36
జగనన్న విద్యాకానుక	65,471	1.22
విద్యార్థులకు ట్యాబ్‌లు	9,471	5.75
జగన్న తోడు	62,858	38.92
జగనన్న గోరుముద్ద	71,452	1.18
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	1,36,471	52.92
వైఎస్సార్ కంటి వెలుగు	435	0.58
ఇంటింటికి రేషన్	2,89,242	54.92